క్లుప్తంగా

రేపు క్యాంపస్ రిక్రూట్‌మెంట్

నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరిదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిక్రూట్‌మెంట్ మేళాలో ఎంఎస్ మహేంద్ర ఆటో పయనీర్ వరల్డ్, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, నిర్మల ఇండస్ట్రీస్, పవర్ సర్వీసెస్, బెంగళూరు గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్‌తో పాటు ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై డ్రైవ్ నిర్వహిస్తారన్నారు. రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటీస్ శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశం కల్పించబడునన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిక్షణ కాలంలో శిక్షణా భృతి అందించబడుతుందన్నారు. పూర్తి వివరాలకు అప్రెంటీస్ అడ్వైజర్ 9849479524ను సంప్రదించాలన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

రేపల్లె: పట్టణంలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఈ నెల 20వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సమస్యలపై విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీవీ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అదాలత్‌కు సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు, ఫార్మర్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి, సభ్యులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను కార్యక్రమంలో లిఖితపూర్వకంగా అందజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

27న దేవస్థానం భూములు కౌలుకు వేలం

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో రామలింగేశ్వర స్వామి, బసవేశ్వరస్వామి దేవస్థానాలకు సంబంధించిన భూములు మూడు సంవత్సరాలకు కౌలుకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఈమని అశోక రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన దేవస్థానంలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

సర్టిఫికెట్‌ల జారీలో ఇబ్బందులు పెడుతున్నారు

రేపల్లె: సర్టిఫికెట్‌లు ఇవ్వటంలో జాప్యం చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారంటూ పట్టణంలోని ఓ సంస్థలో చదువుతున్న విద్యార్థులు బుధవారం ఆర్డీవో రామలక్ష్మిని ఆశ్రయించారు. సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా నగదు డిమాండ్ చేస్తున్నారని ఇచ్చిన సర్టిఫికెట్‌లలో వివరాలు అసంతృప్తిగా ఉన్నాయని పలువురు విద్యార్థులు ఆరోపించారు. ఆర్డీవో రామలక్ష్మి సమస్యను పరిష్కరించాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో విద్యా శాఖ అధికారులు సమస్యను పరిశీలించి సర్టిఫికెట్‌లు కోరిన విద్యార్థులకు పూర్తి వివరాలతో కూడిన సర్టిఫికెట్‌లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: యోగాంధ్ర కార్యక్రమాలలో అందరు పాల్గొనాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని అనేక ప్రాంతాలలో యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం మార్కెట్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక వద్ద 500 మంది విద్యార్థులతో యోగాంధ్ర ఆకృతిని ప్రదర్శించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రధాని ధ్యేయం



తెనాలి టౌన్: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రధాని మోదీ 11 సంవత్సరాల పరిపాలన పూర్తి చేసుకున్నారని ఎ.సందీప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మారీసుపేట బీజేపీ కార్యాలయంలో వికసిత్ భారత సంకల్ప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సేవలు, లక్ష్యాలు, పథకాలు తెలియజేశారు. దేశంలో పేదరిక నిర్మూలన, డిజిటల్ అక్షరాస్యత, మేకిన్ ఇండియా వంటి పథకాలు, అందరికీ బ్యాంకు అకౌంట్, జన్‌ధన్ యోజన, లబ్ధిదారులకు నేరుగా వారి నగదు బదిలీ.. ఇలా మెరుగైన పారదర్శక పాలన అందించిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎ.స్వరూప రాణి, కె.వాసుదేవ, ఎం.కనక దుర్గ, ఎం.హరికృష్ణ, బిట్ర కనక దుర్గ పాల్గొన్నారు.

సిఫారసు ఉందా.. అయితే.. ఓకే..!



- కూటమి నాయకులు సిఫారసు చేసిన వారికే పశువుల దాణా
- నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతున్న పశు వైద్యాధికారులు
- సామాన్య రైతులకు అందని సబ్సిడీ దాణా

రేపల్లె: పేద రైతులకు అందాల్సిన సబ్సిడీ దాణాలో అధికారుల తీరు పచ్చనేతల సిఫరసు ఉందా.. అయితే ఓకే అన్న చందంగా తయారైంది. పేద రైతుల అభివృద్ధి కోసం రూపొందించిన పథకాలు నిర్వీర్యమయిపోతున్నాయి. అర్హుల వద్దకు చేరాల్సిన సమయంలో కూటమి నాయకులు, కార్యకర్తల సిఫారసులతో దారి మళ్లుతున్నాయి. గ్రామీణ ప్రాంత పశు పోషకులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పశువుల దాణా పంపిణీ పథకం పక్కదారి పడుతోంది. 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న పథకాన్ని కూటమి కార్యకర్తలు తమ వశం చేసుకుంటున్నారు. అధికారులపై ఒత్తిడి తెస్తూ తాము సూచించిన వారికే దాణా అందించాలని హుకుం జారీ చేస్తున్నారు. అధికారుల ఒత్తిళ్లకు తలొగ్గిన పలువురు పశు వైద్యాధికారులు పచ్చ కార్యకర్తల సిఫారసు ఉంటేనే దాణా ఇచ్చేది అని బహిరంగంగానే అంటూ అభాసు పాలవుతున్నారు.

పశువుల దాణా పథకం వ్యవసాయం మీద ఆధారపడి జీవించే చిన్న రైతులకు ఉపశమనంగా నిలవాల్సి ఉంది. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. అధికారుల చేతుల్లో పథకం నడవక, నాయకుల చేతుల్లో బంధించిపోయింది. ప్రస్తుతం పశువుల దాణా పథకం కేవలం సిఫారసుల ఆధారంగా మాత్రమే రేపల్లె నియోజకవర్గంలో అమలవుతోంది. రాజకీయ నాయకులు సిఫారసు చేసిన వారికే ఈ లబ్ధి అందుతోంది. పలుచోట్ల పశు వైద్య శాఖ అధికారులు నాయకుల సూచనలు లేకుండా సామాన్య రైతులను పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితి వల్ల వాస్తవానికి అర్హులైన చాలా మంది రైతులు సబ్సిడీ దాణా పొందలేక నష్టపోతున్నారు.

డివిజన్‌లో 48,570 పాడి పశువులు

రేపల్లె వ్యవసాయ డివిజన్ పరిధిలో రేపల్లె పట్టణంతో పాటు రేపల్లె మండలం, నగరం, నిజాంపట్నం, భట్టిప్రోలు మండలాలు ఉన్నాయి. వీటిలో 48,570 పాడి పశువులు ఉన్నాయి. పాడిరైతులను ప్రోత్సహించి పాల ఉత్పత్తిని పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా అందిస్తోంది. రూ.1,200 విలువగల పశువుల దాణా పశు వైద్యశాలల ఆధ్వర్యంలో రూ.600కే రైతులకు అందాల్సి ఉంది.

అరకొరగా సరఫరా

రేపల్లె సబ్‌డివిజన్‌కు సుమారు 250 టన్నుల పశువుల దాణా కావాల్సి ఉండగా ప్రభుత్వం కేవలం 70 టన్నులు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుంది. వచ్చిన అరకొర పశువుల దాణా లబ్ధిదారులకు పంపిణీ చేయటంలో పశు వైద్య శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇది చాలదన్నట్లు పంపిణీలో కూటమి కార్యకర్తలు వేలుపెడుతుండటంతో దాణా పంపిణీ అధికారులకు తలకు మించిన భారంగా మారుతోంది. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పశువుల దాణా పంపిణీలో కూటమి నాయకుల ఒత్తిళ్లు అధికమయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో 50 కిలోల పశువుల దాణా రూ.1,300 నుంచి రూ.1,350 ఉండటంతో సబ్సిడీ దాణా కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పశు వైద్యశాలలకు వెళ్లి దాణాను కోరినప్పటికీ మీ పంచాయతీ నుంచి కూటమి నాయకులతో సిఫార్సులు చేయిస్తేనే దాణా ఇస్తామంటూ పలువురు వ్యవసాయ శాఖ అధికారులు బహిరంగంగా అంటుండటంతో రైతులు ముక్కున వేలేసుకున్న పరిస్థితులు ఉన్నాయి. దాణా కోసం వారి చుట్టూ తిరిగి వారిచే సిఫారసులు చేయించలేమంటూ నిరాశ చెందుతున్నారు.



దాణా తింటున్న పశువులు

అర్హులైన రైతులకు అందిస్తున్నాం

సబ్సిడీ పశువుల దాణా పంపిణీ సక్రమంగా జరుగుతోంది. భారత్ సంచార్ యాప్‌లో నమోదై ట్యాగ్‌లు వేయించిన పశువులకు అందజేస్తున్నాం. ఇప్పటి వరకు సబ్ డివిజన్‌కు తొలివిడతగా వచ్చిన 70 టన్నుల పశువుల దాణా అర్హులకు పంపిణీ చేశాం. పశువుల దాణా తీసుకునేందుకు ఎవరి సిఫార్సులు అవసరం లేదు. కూటమి నాయకుల సిఫార్సులతోనే పంపిణీ జరుగుతుందంటూ వచ్చిన ఆరోపణలు అవాస్తవం. పశువుల దాణా పంపిణీని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– నాంచారయ్య, పశు వైద్యశాల సహాయ సంచాలకులు, రేపల్లె

మట్టి మాఫియాను అరికట్టాలి

జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్‌రాంజీ



మాట్లాడుతున్న జైభీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాంజీ

రేపల్లె: నియోజకవర్గంలో విచ్చలవిడిగా జరుగుతున్న మట్టి మాఫియాను అరికట్టాలని కోరుతూ జైభీమ్‌రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నగరం, చెరుకుపల్లి మండలాల్లో మట్టి మాఫియా పేట్రేగిపోతోందన్నారు. చినమట్లపూడి, పెదమట్లపూడి, ఈదుపల్లి, రాంబొట్లవారిపాలెం, బలుసులపాలెం గ్రామాల నుంచి పగలు రాత్రి తేడా లేకుండా వందలాది లారీల మట్టి అక్రమంగా తరలిపోతోందన్నారు. మట్టి మాఫియాను అరికట్టాలని గతంలో పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న మట్టి మాఫియాపై గత సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డివిజన్ అధికారులను ఆదేశించారన్నారు. డివిజన్, మండల స్థాయిల్లో మట్టి మాఫియాను అడ్డుకోవటంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి మట్టి మాఫియాను అడ్డుకుని అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోతే న్యాయపరంగా పోరాటాలు చేస్తామన్నారు. జైభీమ్‌రావ్ పార్టీ అధినేత జడ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జైభీమ్ రావ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పర్రె కోటయ్య, రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలంలో మహిళపై దాడి



ప్రభుత్వ ఆసుపత్రిలో రజని, సునీల్‌కుమార్

అమర్తలూరు(వేమూరు)/తెనాలి: తమ పంట భూమిలో దుక్కి దున్నించడానికి వెళ్లిన ఇరువురిపై దాడి జరిగిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అమృతలూరు మండల పరిధిలోని మూల్పూరులో తెనాలికి చెందిన వేములపల్లి రజని, తన సోదరుడి కుమారుడు వెనిగళ్ల సునీల్ కుమార్‌తో కలసి పొలంలో దుక్కి పనులకు వెళ్లారు. అయితే మూల్పూరుకు చెందిన యలవర్తి భూషయ్య, మరికొందరు తమపై దాడికి దిగి హత్యాయత్నం చేశారని ఆరోపిస్తూ తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. అనంతరం తమపై జరిగిన దాడి ఘటనపై తెనాలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరారు. ఆస్తి వ్యవహారాల్లో ఏర్పడ్డ పేచీల వల్ల ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం.

మోటూరి సేవలు చిరస్మరణీయం



మోటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



హనుమంతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సీపీఎం నాయకులు

రేపల్లె: పేదల పక్షపాతిగా మోటూరి హనుమంతరావు చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం డివిజన్ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. మాజీ శాసనసభ్యుడు మోటూరి హనుమంతరావు వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించి అనంతరం మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పేదల పక్షపాతిగా, శాసనసభ్యునిగా, రాజసభ సభ్యునిగా అనేక పోరాటాలు చేసిన హనుమంతరావును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. రేపల్లె తొలి శాసనసభ్యునిగా ఎన్నికైన హనుమంతరావు పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. పేద కుటుంబంలో జన్మించిన ఆయన నిరంతరం రైతు, కార్మిక ఉద్యమాలలో పాల్గొని అనేక విజయాలు సాధించి నేటి తరం నాయకులకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వై.కిషోర్, కె.ఆశీర్వాదం, డి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, నవీన్, అగస్టీన్, సాయి ప్రసాద్, వెంకట్రావ్, రమేష్, యు.రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ హనుమంతరావు వర్ధంతి

భట్టిప్రోలు(వేమూరు): చల్లపల్లి జమిందారులకు వ్యతిరేకంగా బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలని పెద్ద ఎత్తున పోరాటాలు చేసిన మహనీయుడు మోటూరి హనుమంతరావు అని ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఉద్యోగి పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి అన్నారు. భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు గ్రామంలో మోటూరి హనుమంతరావు వర్ధంతిని బుధవారం సీపీఎం నాయకులు నిర్వహించారు. మోటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెల్లటూరు గ్రామానికి చెందిన హనుమంతరావు పేద రైతు కుటుంబంలో జన్మించారని, విద్యార్థి దశలోనే ఆయన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని అన్నారు. 1948లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో టి.కృష్ణ మోహన్, మురుగుడు సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు, వేములపల్లి వెంకటరామయ్య, చిక్కాల మణిలాల్, గోళ్ల నాగరాజు, దీపాల సత్యనారాయణ, పి.మనోజ్ కుమార్, బి.అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం తప్ప పాలన శూన్యం



జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు



భట్టిప్రోలులో పుస్తకావిష్కరణ చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ నగరం నాయకులు

వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్

వేమూరు: ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం తప్ప పాలన శూన్యమని బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్ అన్నారు. వేమూరు మండల కేంద్రంలో 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 నెలల కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాల్లేవని, అభివృద్ధి ఎక్కడో అర్థం కావడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెడ్‌బుక్ రాజ్యాంగానికి అధికారులందరు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గోపాలం రాము, గాజుల చినభాను, దున్నా మేరీసుబాబు, గుమ్మడి దానియేలు, తలతోటి జిగిన్‌బాబు, పట్టెల రంగబాబు, ఈపూరు బాబురావు, బొల్లెద్ గోపినాథ్, బాలిగ శిమన్నారాయణ, చందోలు బాబురావు, యువత పాల్గొన్నారు.

భట్టిప్రోలులో పుస్తకావిష్కరణ

భట్టిప్రోలు(వేమూరు): రాష్ట్రంలో అభివృద్ధి కన్నా మద్యం ఏరులై పారుతుందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పడమట శ్రీనివాసరరావు అన్నారు. భట్టిప్రోలు మండల కేంద్రంలోని 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సూచనల మేరకు పుస్తకావిష్కరణ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కుందేటి రమేష్, జల్లి జోషికాంత్, సయ్యద్ సిరాజుద్దీన్, ఎంపీటీసీ కొతర్పు పద్మావతి, శ్రీనివాసరరావు, మోర్ల కోటేశ్వరరావు, కొతర్పు ప్రసాద్, జంగం వాసు, మద్దుల గిరిధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో పుస్తకావిష్కరణ

నగరం: 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణను మండల కేంద్రమైన నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు చేసిన మేలును, కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నయవంచన చేసిన చంద్రబాబు నైజాన్ని తెలియపరుపస్తూ ప్రజలను చైతన్య పరిచేందుకు పుస్తకాన్ని ఆవిష్కరించటం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిజాంపట్నం కోటేశ్వరరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పాగోలు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దొంతిబోయిన కొండల రెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు తొలిచూరి బాలకృష్ణ, వ్యవసాయ విభాగం అధ్యక్షుడు కొండేపి శ్రీనివాసరావు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు, సజ్జవారిపాలెం, ధూళిపూడి ఎంపీటీసీ సభ్యులు ఖాదర్ వలీ, బాబురావు, వెనిగళ్ళవారిపాలెం సర్పంచ్ శ్యాం ప్రసాద్, నాయకులు పృథ్వి, అలీబుడా, ఖాదర్ ఖాన్, సుబ్బారావు, కిరణ్, కూరగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించే స్థాయి అనగానికి లేదు

- నియోజకవర్గంను జూద హబ్‌గా మార్చిన ఘతన అనగానిదే
- వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ శేషగిరిరావు



రేపల్లె: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు లేదని వైఎస్సార్‌సీపీ రేపల్లె పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు అన్నారు. పట్టణంలోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు పల్నాడుకు వెళ్లిన జననేత జగన్‌ను చూసేందుకు లక్షలాదిగా తరలివచ్చిన జనం, కార్యకర్తలను చూసి కూటమి నాయకులకు భయం పట్టుకుందన్నారు. జగన్ గురించి మాట్లాడే అర్హత కూటమి పార్టీలో ఏ నాయకుడికి లేదన్నారు. శవరాజకీయాలు చేయటంలో రేపల్లె నియోజకవర్గంలో సత్యప్రసాద్‌కు పెట్టింది పేరన్నారు. నియోజకవర్గంను జూద హబ్‌గా మార్చిన ఘనత మంత్రి సోదరులుకే దక్కుతుందన్నారు. గ్రామగ్రామాన మద్యం ఏరులై పారిస్తూ అక్రమార్జన చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పేకాట, కోడిపందేలతో పాటు విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారని విమర్శించారు. రేపల్లెను ఎంతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకోవటమే గానీ నియోజకవర్గంకు అనగాని చేసిందేమీ లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. తీరప్రాంతమైన రేపల్లెకు రెవెన్యూ డివిజన్ హోదాను, నిజాంపట్నం హార్బర్‌ను రూ.451 కోట్లతో, దళితుల చిరకాల వాంఛ అయిన అంబేడ్కర్ భవనం, రైతు బజారు నిర్మాణం, క్రీడాకారులు తర్ఫీదు పొందేందుకు ఇండోర్ స్టేడియం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా రేపల్లె ప్రజలకు ఏం చేయకుండా చంద్రబాబు, లోకేష్‌ల మెప్పు పొందేందుకు సత్యప్రసాద్ తమ అధినేత జగన్‌పై అవాక్కులు చవాక్కులు పేలితే చూస్తూ ఊరుకోమన్నారు. నమ్మకంతో గెలిపించిన ప్రజలకు మంచి చేసి నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మంత్రి సత్యప్రసాద్‌కు హితవు పలికారు.

కౌలు రైతులు కార్డులు పొందాలి



చినపరిమి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



యలవర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాధవి

చుండూరు(వేమూరు): కౌలు రైతులందరు కౌలు కార్డులు పొందాలని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. చుండూరు మండలంలోని చినపరిమి, మండూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులు వాడాలని, రసాయన ఎరువులు తగ్గించాలని సూచించారు. రైతులు వరి విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పాటిబండ్ల ఆదంబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పొలాల్లో పచ్చిరొట్ట ఎరువు వేయాలి

అమర్తలూరు(వేమూరు) : పొలాల్లో పచ్చి రొట్ట ఎరువులు వేయాలని వ్యవసాయ విస్తరణాధికారి మాధవి అన్నారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులందరు సీసీఆర్‌సీ కార్డులు తప్పని సరిగా పొందాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం లబ్ధి కొరకు రైతులు ఈ కేవైసీ చేయించుకోవాని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇప్పటంలో కమిషనర్ పర్యటన

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటంలో రూ.5 లక్షల వ్యయంతో చెరువు చుట్టూ రహదారి నిర్మిస్తున్నామని అన్నారు. ఇప్పటం ప్రధాన రహదారిలో వాహనాల వేగ నియంత్రణ కోసం ప్రజలు స్పీడ్ బ్రేకర్లు వేయమని కోరారని, ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. రూరల్ పరిధిలోని చిర్రావూరులో వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. హార్టికల్చర్ ఏఈ రామమోహనరావు, డీఈ రాము, ఏఈలు పాల్గొన్నారు.

కిల్కారి కాల్ సేవలపై అవగాహన

మంగళగిరి టౌన్: కిల్కారి మొబైల్ సేవలను వినేలా గర్భిణులు, బాలింతల్లో అవగాహన కల్పించాలని కిల్కారి ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు అన్నారు. మంగళగిరి మండల పరిధిలోని నూతక్కి యూపీహెచ్‌సీలో కిల్కారి కాల్స్‌పై ఆశాలు, ఏఎన్ఎమ్‌లు, వైద్య సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్యులు లక్ష్మీ నారాయణ, సీహెచ్‌వో ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను తక్షణం పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు బుధవారం నాటికి 197వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించి మద్దతు తెలియజేసి, మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సుభాని, గురవయ్య, సుబ్బారావు, పిచ్చయ్య పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో కార్మికులకు షాక్

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కేబీ ప్రసాద్

తెనాలి: విద్యుత్ రంగంలో అదాని స్మార్ట్ మీటర్ల ద్వారా పాలకులు అప్రకటిత సంస్కరణలు అమలు చేయాలని చూస్తున్నారనీ, వీటి ప్రభావంతో రాబోయే రోజుల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్స్ స్కీం కార్మికుల జీవితాలు దుర్భరంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. కేబీ ప్రసాద్ మాట్లాడుతూ, కరువు భత్యం అమలు జరగని కార్మికులకు పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలను ప్రభుత్వం చెల్లించదని చెప్పారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని ప్రజలు మోయాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యుత్ చార్జీల పెంపు జరిగితే అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు ఇంటి అద్దెలు కూడా పెరుగుతాయని గుర్తు చేశారు. దీంతో కార్మికుల అప్పుల ఊబిలో కూరుకుపోయి వారి జీవితాలు దుర్భరంగా మారతాయని చెప్పారు. కార్మిక వర్గానికి స్మార్ట్ మీటర్లు షాకిచ్చే మీటర్లుగా మారతాయనీ, వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దుర్గా ప్రసాద్, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, గోపి, శ్రీనివాసరావు, భాస్కర్, సుధాకర్, మరియమ్మ, పద్మ పాల్గొన్నారు.